

జనగామ పట్టణంలోని 2వ వార్డులో రక్తనమూనా సేకరిస్తున్న ఎన్ఐఎన్ బృందం సభ్యుడు

# రాష్ట్రంలో 'సీరో' సర్వే ప్రారంభం

**3 జిల్లాల్లో ఎన్ఐఎన్ బృందాల పర్యటన**

**తొలి రోజు 600రక్త నమూనాల సేకరణ**

హైదరాబాద్ సిటీ/జనగామ/నల్లగొండ/కామారెడ్డి, మే 15 (ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తిపై అధ్యయనానికి తెలంగాణలోని వివిధ జిల్లాల్లో 'సీరో' సర్వేను ప్రారంభించినట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) డైరెక్టర్ డాక్టర్ హేమలత తెలిపారు. ఇందుకు రాష్ట్రంలోని జనగామ, కామారెడ్డి, నల్లగొండ జిల్లాలను ఎంపిక చేశామని, ప్రతి జిల్లాలో 10 గ్రామాలపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. ఐసీఎంఆర్, ఎన్ఐఎన్ సంయుక్తంగా చేపట్టిన సర్వే సజావుగా జరిగేలా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సహకరిస్తోందన్నారు. సీరో సర్వేలో భాగంగా ఎన్ఐఎన్‌కు చెందిన బృందాలు శుక్రవారం జనగామ జిల్లాలో పర్యటించాయి. జిల్లా కేంద్రంలోని 2వ మునిసిపల్ వార్డు, బచ్చన్నపేట మండలం కొడ్వటూరు, లింగాలఘణపురం మండలంలోని కళ్లెం, దేవరుప్పుల మండలంలోని మాధాపురం, నర్మెట మండలంలోని హన్మంతాపూర్ గ్రామాల్లో 200 రక్తనమూనాలు సేకరించాయని ఎన్ఐఎన్ నోడల్ ఆఫీసర్ లక్ష్మయ్య తెలిపారు. ఎన్ఐఎన్‌కు చెందిన 25 మంది నిపుణుల బృందం నల్లగొండ జిల్లాలోనూ పర్యటించింది. సర్వేలో భాగంగా తొలిరోజు నల్లగొండ పట్టణంతో పాటు కట్టంగూరు, కనగల్ తదితర మండలాల్లో 200 నమూనాలు సేకరించారు. సీరో సర్వే కోసం కామారెడ్డి జిల్లాలో 200 నమూనాలు సేకరించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 40 చొప్పున రక్తం శాంపిళ్లు సేకరించారు.

# సామాజికవ్యాప్తి జరుగుతోందా?

- **తేల్చేందుకు ఐసీఎంఆర్ 'సీరో' సర్వే**
- **దేశవ్యాప్తంగా 69 జిల్లాల్లో.. తెలంగాణలోని 3 జిల్లాల్లో**
- **నిర్వహణలో ఎన్ఐఎన్ శాస్త్రవేత్తలు**
- **'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో నోడల్ ఆఫీసర్ లక్ష్మయ్య**

గ్రామీణ ప్రాంతాల్లో 'కరోనా' సామాజిక వ్యాప్తి జరిగిందా? లేదా ? అనేది నిర్ధారించడానికి భారత వైద్యపరిశోధనా మండలి(ఐసీఎంఆర్) తలపెట్టిన 'సీరో' సర్వే ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రంలో జనగామ, కామారెడ్డి, నల్గొండలలో ఈ సర్వేను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) సిబ్బంది చేపట్టారు. దీనికి సంబంధించిన అంశాలను ఎన్ఐఎన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎ.లక్ష్మయ్య 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆయనతో ఇంటర్వ్యూ వివరాలివీ..

**- స్పెషల్ డెస్క్**



## సీరో సర్వే ప్రధాన ఉద్దేశమేమిటి?

గ్రామీణ ప్రాంతాల్లో కరోనా ఎలా వ్యాప్తి చెందిందనే విషయాన్ని తెలుసుకోవడానికి ఐసీఎంఆర్ ఈ సర్వేను చేపట్టింది. ప్రతి 10లక్షల మందిలో ఎంత మందికి కరోనా వచ్చిందనే గణాంకాలను విశ్లేషించి.. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం జిల్లాలను 4 కేటగిరీలుగా విభజించారు. వీటి పరిధిలో మొత్తం 69 జిల్లాలను ఎంపిక చేశారు. ఈ జిల్లాల్లో 10 చొప్పున గ్రామాలను ఎంపిక చేసి వాటిలో 'సీరో' సర్వే చేస్తున్నాం. దీనిలో ఎన్ఐఎన్‌కు చెందిన 45 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

## ఈ సర్వేను ఎలా చేస్తారు?

ప్రతి జిల్లాలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసి వాటి నుంచి 400 బ్లడ్ సీరమ్(రక్తం) నమూనాలను సేకరిస్తున్నాం. అంటే తెలంగాణలో మొత్తం మూడు జిల్లాలలో 1200 నమూనాలను రేపటి(మే 17)లోగా సేకరిస్తాం. ఇవి తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో ఇన్ఫెక్షన్ల వ్యాప్తికి అద్దం పడతాయి. రక్తపు నమూనాలను పరీక్షించిన తర్వాత వాటిలో యాంటీ బాడీలు ఉన్నాయా ? లేదా? కరోనా పాజిటివ్ కేసులు ఉన్నాయా? లేదా? అనేది తేలిపోతుంది. ఈనెల 25 వరకు దేశవ్యాప్తంగా సేకరించనున్న నమూనాల ఫలితాలను విశ్లేషించిన తర్వాత ఐసీఎంఆర్ భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాన్ని నిర్ణయిస్తుంది.

## పట్టణ ప్రాంతాల్లోనూ ఈ సర్వే చేస్తారా?

ఈ సర్వే తర్వాత దేశంలోని 10 హాట్‌స్పాట్ నగరాలను ఎంపిక చేసి వాటిలో సర్వే చేయాలని ఐసీఎంఆర్ నిర్ణయించింది. ఇందులో 500 చొప్పున నమూనాలను సేకరిస్తారు. వీటి విశ్లేషణలో వచ్చే ఫలితాల ఆధారంగా నగరాలలో అవలంభించాల్సిన విధానాలను నిర్ణయిస్తారు.

## ఈ సర్వే వల్ల కలిగే ప్రయోజనమేంటి?

సామాజిక వ్యాపి జరుగుతోందా? లేదా ? అనేది తెలియాలంటే ఇలాంటి సర్వేలు అత్యవసరం. ఉదాహరణకు నాలుగోవిడత లాక్‌డౌన్‌లో ఎలాంటి సడలింపులు ఇవ్వాలో నిర్ణయించడానికి కొన్ని సూచికలు కావాలి. వాటికి ఇలాంటి శాస్త్రీయ సర్వేలు ప్రాతిపదికగా నిలుస్తాయి.

ఆంధ్రజ్యోతి Sat, 16 May 2020
https://epaper.andhrajyothy.com/c/52008125